# నీడల నడవ

"గదిలోనుంచి దీపంవెలుగు,
ఇవతల నడవలోనికి,
గుమ్మంగుండా పడుతూ:—
నడాడుతూవున్న వాళ్ళ నీడల్ని,
నీడల క్కారణా లైన వాళ్ళ వాళ్ళ నడకల్ని
వేర్పాటుగా కాపరుస్తూవుంది."

ఈ పై దృశ్యాన్ని నేను నా పాఠకులయెదుట "మాతృ చిహ్నము" అనే రచనయందు లోగడ ప్రదర్శించియున్నాను. నాతోపాటు పాఠకులీపైనుంచి ఆ నడవను "నీడల నడవ" అనే పేరుతో గుర్తింతురుగాక! ఆ దృశ్యము నేను ప్రత్యక్షముగా ఏ 1899 లోనో నా యేడవ యేట చూచినదై వుంది. నా తల్లి గతించిన నాటి రాత్రి నీడ లవి; నా బంధుగులివి; మా యూరి వారివి; దీపం వెలుగులో నిశ్శబ్దంగా నడాడుతూవున్న మర్త్యులవి.

మనుష్యులు నడాడుతూ వున్నంతసేపు దీపం వెలుగుతూ వున్నంత మాపు, నాకు భయమనిపించలేదు. తరువాత మరునాటి రాత్రి దీపంలేదు. నరసంచారంలేదు ఆ నడవలో—వీధిలోనుంచి ఆడుకుని ఆలా ఆలా పరుగెత్తుకుంటూ వచ్చి వీధిగుమ్మంలోంచి నడవలోకి అడుగుపెట్టాను. నడవ అంతా ఒక్కటే పెద్ద నీడగా తట్టి అట్టే భయపెట్టింది నన్ను! గుట్టుగా వీధిగుమ్మంలోనుంచి లోపలి గుమ్మంలోనికి ఒక్కదాటు దాటాను. "అమ్మయ్యో! అంటూ—నా కేక ఎవరైనా మా యింట్లో పెద్దవాళ్లు గాని, మరొకళ్ళుగాని విన్నారో లేదో! అని నాలో ఒక మహా సంకల్పాన్ని నెలకొల్పింది. "ఆ నడవమ్మట నీవు అర్ధరాత్రి,

అపరాత్రి. అంధకారంలో నడవరాదు. ఒక్క మట్టమధ్యాహ్నమే మహాకాంతి. మార్తాండతేజం. నడుపీధిలోనుంచి నడవలోనికి ప్రసరించేటప్పుడే ఆ నడవమ్మట నడువు!'' అనే సంకల్పం వెంటనే జనించింది. నాలో నాకే జనించింది. అనాటినుంచి అంధకార సమయాన్ని అసుర సంజప్పుడు ఆ నడవమ్మటనే నడవడం మానేశాను. ఒంటరిగా నడవడం మానేశాను అనుకోండి లేకపోతే—కాని మహత్తర మార్తాండ తేజమప్పుడు తరుచు ఒక్కన్ని ఆ నడవలో నిలబడిపోతూ, ఆ యొక్క తేజోరాశికి ఆశ్చర్యపోతూ వెనకగన్న నీడల్ని. అంధకారాన్ని దీపాన్ని పూర్తిగా మరచిపోయినవాన్నై ఒక్కొక్కప్పుడు అత్యుత్సాహంగా గంతులు వేసేవాన్ని. నృత్యం చేసేవాన్ని. ఏదో అర్థం లేని ఆలాపన గావించేవాన్నికూడాను.

ఇలా ఉంటూ వుండగా, ఇదంతా నా చిరుతప్రాయమందే ఒక మట్టమధ్యాహ్నంపూట ఏం జరిగిందీ?—నా నృత్యంలో నా చేయి వీధితలుపును తగిలి మూసింది. ఏముంది? మరి అంతా చీకటిమయంగా వెంటనే తట్టి అట్టై భయపెట్టింది నన్ను!—"అమ్మయ్యో'' అని రెండో గుమ్మం అమ్మట లోగిలిలోపలికి పరుగెత్తుకు పోదామని తిరిగేలో. ఎదర పెల్ల గోడమీదను. తల్లక్రిందులుగా, మనిషిబొమ్మ అల్లల్లాడుతూ కాపడింది.—వెంటవెంటనే అదృశ్యమౌతూ ఎవరో వీధితలుపు తెరచినట్టయింది.

మరి కాంతిల్లక తప్పదని, వీధితలుపువంకకు జూచాను. తోడి సహాధ్యాయి వొక్కడెవడో నడవలోనికి వచ్చి "ఏమిటి చేస్తున్నావు?'' అని అడిగాడు. వాని కేమీ చెప్పకుండా "గోడ మీద నీడ! ఏమైందో? నీడ! తల్లక్రిందుల మనుష్యుల నీడ!''

అన్నాను. వాడు ఆ చెలికాడు " తల్లక్రిందుల మనుష్యుల నీడ ఏమిటి ? ఎప్పుడూ వినలేదే ! " అని వీధిలోనికి వెళ్ళి కనకనలాడే సూర్యబింబాని కడ్డుగా చే యెట్టుకు ఆకాశంవంక చూడసాగాడు. నేనున్నూ అదే పనిగా చూడసాగాను. ఎందుకలా చూచామో మాకే తెలీదు. తిరిగి ఇద్దరం నడవలోనికివెళ్ళి వీధితలుపువేసి చూచాము. నడవ అంతా అంధస్సు. గోడమీద నీడాలేదు గీడాలేదు.

మే మిద్దరం మాకు వుండివున్న వూహా విజ్ఞానాల సాహాయ్యంవల్లను ఒకానొక నిశ్చయానికి వచ్చేలో. ఏదో. మనిషి నీడే. గోడమీద తల్లక్రిందులుగా. మరోసారి కనబడింది. ఎవరిదో. అలా. నిలుచుండిపోయి నట్టుగా వుంది ఈ నీడ. తల్ల క్రిందులుగానే వుంది. మా కా పర్యాయం వీధితలుపు తీయాలని తోచలేదు. లోపలి గుమ్మంగుండా లోగిలిలోనికి పరుగెత్తాలని అపిపించలేదు. ఇద్దరం వున్నాంకాబట్టి. ఒకరివొంక వొకళ్ళం చూచుకు ధైర్యం వహించినట్టు సంచరిస్తూ అలా తల్లక్రిందులు నీడను పరీక్షింపసాగాం-పరీక్షిస్తూ—" కాళ్ళు ఆకాశాన్ని పెట్టుకు నడిచేవాళ్ళు దేవతలుగాక మరొకరు కారు. దేవతల నీడలు అవి" అని నిర్ధారించుకుని అదో పెద్ద రహస్యం కనిపెట్టినట్లు ఇద్దరం కలిసి అలా నిలబడిపోయి నీడను గంటూ వినడానికి చెవులొగ్గాం-చెవులొగ్గాం - ఆవలనుంచి " అయ్యగారూ ! " అని కేక వినిపించింది. నీడ నోరు తెరచింది. నీడ నోరుతెరడవమే చూడమా అవల అరిచింది ఎవరో తెలిసికోమా ?—ఒకడు నీడ చూస్తూ వుంటే. రెండోవాన్ని నేను తలుపు తెరచి చూచాను. " నీడ మాయమైంది " అని నా మిత్రుడు. " అవల నిలబడి నోరు తెరచుక అరచినవాడు వెలివాడ వీరడు—మా పాలికాపురా ! "

అని నేను నివ్వెరపోయాం. "మరి మాలకులాన్ని దేవతలు చూస్తారా ? చూడ"రని మేం, బ్రాహ్మణ మాణవకులం అనుకున్నాం.

క్రమంగా ఈ గోప్యం వూళ్లో పిల్లకాయల్లో వ్యాపించి పోయింది. మండు మట్టమధ్యాహ్నమప్పుడు, రోజుకు రోజుకు, మా నీడల నడవలోనికి వచ్చే బిడుతల సంఖ్య ఎక్కువ కాసాగింది. వారూవారూ లోపలికి రాకముందు, నీడ, నీడ వెనుక నీడ,—తలుపు వారికోసంగాను నేను తెరచేముందు గోడమీద పడుతూ వచ్చేవి.— తుదకు "ఆ నీడలు, మావే మా పిల్లకాయల నీడలే" అనే ఒకావొక వివేకాన్ని బలిసిపోయినాం! కొందరం నడువీధిలో ఎండప్పుడు నిలబడ్డం, వీధితలుపు మూసివుండడం, కొందరం లోపల ఉండడం, ఈలా అన్యోన్యం నీడల ప్రదర్శనం గోడమీద గావించుకుంటూ నీడల్ని నృత్యం లోనికి దింపాం. చమక్‌గా సింహద్వారం మధ్యమధ్య తెరుస్తూ సత్యం చూరగొనేవాళ్ళం.

ఆ నృత్యాన్ని, ఆ సత్యాన్ని పెద్దవాళ్ళకు కాపరుద్దాం అని అప్పటప్పట ఆదుర్దా పడేవాళ్ళం గాని, మేం, కుర్రవాళ్ళం,— అంతంతై వటు దంతయై—అన్నట్టు మాకు తెలియకుండా అంతలో ఎవరంతటవాళ్ళం ఎదిగి, మేమే పెద్దవాళ్లం అయినాం. ఆ పురాతనపు టింటి వీధితలుపునకు ఒక బెజ్జం, అంతకన్న పురాతనపుది వొకటి వున్నట్టు కనిపెట్టాం. అంతకన్నా పురాతనపుది అని ఏలా అంటున్నానంటే, చెట్టున పుట్టిన బెజ్జం, రంపకారీ కోతకుగూడా ఆ వెలితి వెలితిగా వుండిపోయిందట ! తలుపు బల్లని! - ఆ చెట్టు ఏనాటి చెట్టైనా కావచ్చును - అడవి

పొలంలో మ్రానులు కొట్టించించి, తెప్పించి, కోయించినట్లు ప్రతీతి. అడవి పొలం అనగా అనాదిది! ఔరా! ఆ బెజ్జంగుండా నడువీధిలోని మిడసరలగ్నపుకాంతి మా నడవలోనికి ఏరోజు కారోజు పడుతూ నీడలు చూపించేది! నీడల నాడించేది!

ఇప్పటికీ ఆ బెజ్జం అలాగేవుంది. ఆ తలుపుని. ఆ తలుపు అలాగెవుంది ఆ యింటిని—ఆ యింటి ఆ నడవలో ఇప్పటికి ఆ వేళకు ఆ నీడలు అలా కనిపిస్తూనే వుంటాయి. కాని ఒకటి జరుగుతూవుండాలి. నడవలో ఒక దుండాలి ద్రష్ట. వీధిలో వొక దుండాలి ప్రదర్శించేవాడు.—ఇంతకూ లోపం. ఎవని నీడ వాడు చూడలేడు. ఎంతవాని నీడైనా తల్లక్రిందులుగానే కని పిస్తుంది!

అందుచేతను. నేను పెద్దవాణ్నై. అందులోనూ పదార్థ విజ్ఞాన శాస్త్రమందలి "వేడిమి—వెలుగు"ను గురించిన పాఠాలు పదవ తరగతిలో నేర్చుకొని. సూర్యకిరణాలంటే ఏమిటో, బెజ్జాలు (ఛింకృ) గుండా వాటి ప్రసార మెట్టిదో, అద్దాల్లో వాటి ప్రతిఫలం ఎల్లాంటిదో ఇదంతా బాగా అవగాహన అయిన ఈ తరువాతను, మరి ఆ నీడల నడవలో ఆ దృష్ట్యా నేను అడుగు ఇడిందిలేదు. నా తరువాతి తరంవారు ఆ ఆట అనుభవించిందికూడా మృగ్యం.

అయితే నీడలు! నీడలు!! చిన్నప్పుడు నేనుగని ఆటా డించిన నీడల నడవలోని నా చెలికాండ్ర నీడలు నాతోకూడా, నేను పెద్దవాణ్నైనా వుంటూనే వచ్చాయి. ఇంటికి పెద్దనయ్యాను గాని, కంటికి పెద్దను కాజాలకపోయాను.

మరి 1926 లో నాకు చాలా జబ్బుచేసింది. బ్రదుకనే అనుకున్నారట ఒకటి రెండు రోజులు కొందరు కొందరు. అప్పుడేం జరిగిందీ! నా గదిలో కెందరెందరో వచ్చి నీడల్లా నిలబడిపోయి వున్న వాళ్ళను. పొద్దోయి. ఒకరోజున మంచం మీద నుండే చూచాను. "నీడల్లా" అని అనడానికి కారణం వాళ్ళచాయ నలుపు. పోనీ నా చిన్నప్పటి సహవాసుల నీడలా అని తలచేనో కావు. వీరు తల్లక్రిందులుగా లేరు. నిలువుగా నిలబడివున్నారు. నీలమేఘచ్ఛాయా శరీరులై. వారి నుదుళ్ళ పైని వైష్ణవనామాలు తేటతెల్లంగా కనిపించాయి. సశరీరులైన విష్ణుదూతలు కానోపుదురు! ఎందుక్కాకూడదు?—నాకొరకు వారేల వచ్చియుండకూడదు?—ఒక్కుమ్మడి భయమూ భక్తీ నాలో నెలకొనసాగాయి. సంధిలోనే నెలకొనసాగాయి అను కోవాలి మీరు. తేటతెల్లంగా తీర్చి దిద్దిన పంగనామాలు. బలు మొగాలూ వారూ గది క్రిక్కిరిసిపోయారు.

నాకు ఊపిరాడ్డం లేదు వారి ఊపిరుల దండడివి. నాకు మాటలు కట్టడ్డాయి వారి ఉబుసుల సందడిని. వారు నా మంచంచుట్టూ మూగిమూగి ఉగ్గబట్టుకు దేన్నో లాగుతూ వున్నట్టుగా. బలంగా లాగుతూ వున్నట్టుగా ప్రలాపించాను. మంచం పట్టినవాన్ని. బలహీనున్ని. రోగిని—నేను—అమాంతంగా సశరీరంగా మహత్తమ మైన సత్తాతో, వైహాయసవీధికి ఉత్తీర్ణుడనుగా, ఉండిఉండి నిలువునా నిలబడిపోయాను.—విష్ణుదూత లందరూ రెక్కలల్లార్చుకుంటూ నాతోకూడా పైకెగిరి వచ్చేలా చేష్టించారు. నేను. ఆ మహావిష్ణువుయొక్క పాదారవిందాల్ని అందుకున్నాను అంటే నమ్మండి! ఆ వైకుంఠవాసుని కన్నులకు సరాసరి ఎత్తున తిన్నగా నా కన్నులుంచి సందర్శించాను

అంటే విశ్వసించండి! కానీ ఒక చిత్రం! తోటి మానవుల దృష్టిలో నే నెక్కడున్నవాన్ని అక్కడేవున్నాను. పుష్టిఏమాత్రం నాలో లేనట్టే కనిపించేను. వారికి—వారు వెంటనే వెజ్జుని పిలి పించి నా గోడు నా గోష్ఠి విశదీకరించారు. నా నాడి పరిశీలిస్తూ నవ్వా డమ్మహానుభావుడు. "నాడి మాంచి బలంగా వుంది! ముక్కోటి వేల్పులూ వచ్చి లాగినా లాక్కుపోలేరు. ఆ మహా విష్ణువు వేంచేసికూడా సాధించలేడు. ఎందుకు మీకు సంశయం? నేను "క్వినైన్" మోతాదు ఎక్కువచేసి యిచ్చాను. దాని లక్షణంగాని మరొకటికాదు. ఏ విధమైన జంకూ లేదు" అని ధైర్యం చెప్పాడు.

వైద్యుల్ని చూడ్డంతోనే ఏదో వికటప్రశ్న వేయాలని రోగి కెప్పుడూ బుద్ధి. అయినా అందరికీ ఆయన మాటలు ధైర్యం గొలుపవచ్చునుగాక! నాకు? నాముందు రంగు పుండ్రా లున్నంత సేపు?—"విష్ణుదూతలో?" అని అడిగాను సూటిగా చూపిస్తూ. నా చూపుడు వ్రేలు ఆ సమయాన్ని ఎవరివి చూపించిందో, ఎందాకా సాచబడిందో నాకే తెలియదు. గదిలో వున్నవాళ్ళ అందరిదృష్టీ, డాక్టరు మహాశయునిదృష్టి సమేతంగా, నా చూపుడు వ్రేలి మార్గాన్నే, అనంతపథంలోనో, ఇంకా దాని అవల దేన్నో కేంద్రీకరింపబడింది-రెప్పపాటుకాలం! "కళ్లుమూసుకు నిదరోండి. మరి మధ్యాహ్నం మందు వాడకండి. మందు మారుస్తున్నాను. మార్చిన మందు వెంటనే తీసుకోండి'' అని సలహాయిస్తూ, అతిశాంతంగా, మిక్కిలి నిశ్చింతగా విష్క్రమించాడు డాక్టర్. నేను, దీర్ఘాయుష్మంతున్నై మో బ్రతికాను. "గండం గడిచింది" అనుకున్నారు కావలసిన వాళ్లందరూ. కాని నాకు, డాక్టరుగారికి

ఆ దివ్యసందర్శనాన్ని గురించి తీరని చర్చ కొంతకాలం సాగింది. తుద కిలా తేల్చాం. "నేను వ్యాధిగ్రస్తుణ్నై పరున్న రోజుల్లో కాపురమున్న చతురంగణం వైష్ణవాగ్రహారం కాబట్టీన్ని, ఇంటి కెదురుగా శ్రీ ఎంబెరుమన్నారుస్వామి దేవాలయం వున్న కారణాన్ని బట్టీన్ని—శ్రీ రామానుజ మతం మనస్సున కెక్కి ఆలాంటి మాయలో పడద్రోబ్బింది" అని తేల్చాం.

తేల్చామే కాని ఆ సందర్శించిన రూపాల్ని ఈ లోకంలో వాక్కరితోను సరిపోల్చలేకుండా వున్నాను. తొల్లింటి వైకుంఠ పురమునకు కళ్లెదర కట్టి వున్న కోవెలకు హస్తిమశకాంతరం. అసలు రెండింటికీ పరస్పరం పోలికే లేదు. కాబట్టి మందుతోను మతంతోను సంబంధంలేని చిన్మయ స్వరూప సాక్షాత్కార మేల కాకూడ దది? పక్షాంతరంలో చిన్నప్పుడు గన్న తల్లక్రిందుల నీడలే, తోడునీడలై, కాళ్ళమీద నిలబడి నామాలు ధరించి నాకు అమృతం పోసివున్నాయేమో? ఈ కడాపటిదే సిద్ధాంతం.

మా "నీడల నడవ" యొక్క వీధి తలుపు నెలావున్న దాన్ని అలా అనశ్వరంగా అట్టే పెట్టండి. ఇదే నా తుదికోరిక.

## అపురూప సుందరి

"ఇదేనా గ్రామం! ఇదేనా గ్రామం!" అని
అనుకుంటూ వచ్చిన శ్రీమన్నారాయణసింగు

"ఇదేనా గ్రామం? ఇదేనా గ్రామం?" అని ప్రతీ గ్రామాన్ని అపహాస్యంగా అడుగుతూ, ఒకచోట "స్టాండ్" దగ్గర "బస్సు" దిగాడు. అక్కడ దిగీ దిగడంలో అతనికి ఒక బండిగాని, ఒక వాహనంగాని దొరకలేదు. 'బస్సు' రంయిని కొండల్లోకి